1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 72 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 15 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 72 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 15 March 2026 PAGES : 8 PRICE : 3/-

## గిరిజనులు ఇబ్బంది పడుతుంటే తట్టుకోలేకపోయా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 14)

గిరిజనుల కష్టాలను చూసి రహదారుల నిర్మాణానికి ముందుకొచ్చామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అల్లూరి జిల్లా నందిగరువులో గిరిజనులతో పవన్ కల్యాణ్ మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం సమస్యలు విన్న పరిస్థితులు కూడా లేవన్నారు. సరైన రహదారి లేకుండా గిరిజనులు ఇబ్బంది పడుతుంటే చూసి తట్టుకోలేకపోయానన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా.. తనతో పంచుకోవాలని కోరారు. ప్రజల కష్టాలు తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ఉందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఓనూరులో ▶మిగతా 2లో

## ఏపీలో త్వరలో బీసీ రక్షణ చట్టం: మంత్రి సవిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 14)



త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే ముసాయిదా సిద్ధం చేసినట్లు చెప్పారు. కులం, వృత్తి పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై విజయవాడ తాడిగడప బీసీ డైరెక్టర్ కార్యాలయంలో మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర చర్చించారు. చట్టం డ్రాఫ్ట్‌పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ.. బీసీల మానప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు చెప్పారు. "కోర్టుల్లోనూ వీగిపోకుండా న్యాయనిపుణులతో చర్చించాం. దేశంలోనే తొలిసారిగా ఏపీలో చట్టం అమలు చేయబోతున్నాం. భేటీ వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించాం. బీసీలను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్నదే మా లక్ష్యం" అని మంత్రి సవిత తెలిపారు.

## ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

# ఏ ఎన్నికలైనా మనమే గెలవాలి



### ఏప్రిల్ 2న మంత్రులు, కార్యదర్శుల పనితీరుపై నివేదికలు
### మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 14)

మరో ఆరు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు వస్తాయని, ఏ ఎన్నికలైనా మనమే గెలవాలన్న లక్ష్యంతో పనిచేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించేలా ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సీట్ల సర్దుబాటు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తామని తెలిపారు. శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ ముగిశాక మంత్రులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల మంత్రులు,



4

## నిషేధిత జాబితా నుంచి 66,157 ఎకరాల తొలగింపు

పోలవరం సొరంగాల ప్రవాహ సామర్థ్యం పెంపునకు అదనపు పనులు

మూడు జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలకు స్థలాల కేటాయింపు

మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 14)

రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పరిశ్రమలకు కేటాయించిన 66,157 ఎకరాలను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఎ కింద 'నిషేధిత ఆస్తుల జాబితా' నుంచి తొలగించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పరిశ్రమల నిర్మాణం పూర్తయ్యాక మరో 3,803 ఎకరాలనూ షరతులతో 22-ఎ జాబితా నుంచి తొలగించేందుకు అనుమతించింది. సుమారు 51,603 ఎకరాల ప్రభుత్వ, ఇతర భూములను నేరుగా ఏపీఐఐసీ పేరిట రెవెన్యూ రికార్డుల్లో మార్చేందుకు (మ్యుటేషన్‌కు) అనుమతి నిచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. 'పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ కేటాయించిన సుమారు 75 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో అక్కడ పరిశ్రమలు పెట్టినవారు వాటిపై బ్యాంకు రుణాలు పొందటం సాధ్యం కావట్లేదు. పరిశ్రమల నిర్మాణం పూర్తయిన తర్వాతా యాజమాన్య హక్కులపై అనిశ్చితి ఉంటోంది. ▶మిగతా 2లో

## మొజ్తాబా సమాచారం చెప్తే.. రూ.93 కోట్లు ఇస్తాం..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 14)

ఇరాన్ సుప్రీం లీడర్‌గా నియమితులైన మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కోసం అమెరికా భారీ ఆఫర్ ప్రకటించింది. ఆయన ఎక్కడున్నారన్న సమాచారం చెప్పే వారికి 10 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.93 కోట్లు) ఇస్తామని పేర్కొంది. ఎక్స్‌లో యూఎస్ విదేశాంగశాఖ ఈ మేరకు ప్రకటన చేసింది. సుప్రీం నేత ఖమేనీతో పాటు, ఆయన కార్యాలయ డిప్యూటి చీఫ్ అలీ అస్గర్ హెజాజీ, ఇరాన్ భద్రతాధికారి అలీ లారిజాని సహా పలువురి పేర్లను యూఎస్ విదేశాంగశాఖ ప్రస్తావించింది. వీరు ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నారని ఆరోపించింది. వీరికి సంబంధించిన సమాచారం ఉంటే ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ లేదా టోర్ నెట్‌వర్క్ ద్వారా తెలియజేయాలని పేర్కొంది. ఇందుకు గాను తగిన బహుమతి అందిస్తామని తెలిపింది. సమాచారం అందించిన వారికి పునరావాసం కల్పించనున్నట్లు కూడా వెల్లడించింది. ఇక, అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన వారసుడిగా మొజ్తాబా ఎన్నికయ్యారు. యుద్ధం నేపథ్యంలో మొజ్తాబా ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. ఆయన ఎక్కడున్నారనే విషయంపై స్పష్టత లేదు.

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్.. త్వరలో భారత్‌కు వస్తానని సందేశం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 14)

భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని ▶మిగతా 2లో

## ఖర్గ్ ఐలాండ్‌పై దాడి.. అమెరికాకు ఇరాన్ వార్నింగ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 14)

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా.. ఖర్గ్ ఐలాండ్ పై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలగలేదని వెల్లడించింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. యూఎస్‌కు గట్టి హెచ్చరికలు చేసింది. ఇరాన్ మీడియా ప్రకారం.. ఖర్గ్ ఐలాండ్‌పై జరిగిన దాడుల గురించి ఇరాన్ సాయుధ



దళాల కార్యాలయం ప్రతినిధి ఓ ప్రకటనలో స్పందించారు. 'మా చమురు మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడినైనా తీవ్రంగా పరిగణిస్తాం. అలా చేస్తే ఈ ప్రాంతంలో అమెరికాతో సంబంధం ▶మిగతా 2లో

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 14)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. ▶మిగతా 2లో

## గ్యాస్ సరఫరాపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 14)

గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. ఉదయం 11.30 గంటలకు గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ భేటీ అవుతున్నట్లు సీఎంకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏం చేయాలో, ఎంత చేయాలో అంతా చేయాలని సీఎం సూచించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య ▶మిగతా 2లో

## గ్యాస్ సరఫరాపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

లేకుండా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## గిరిజనులు ఇబ్బంది పడుతుంటే తట్టుకోలేకపోయా

జల జీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిని పవన్ కల్యాణ్ పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి, అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. వారికి బ్యాగులు పంపిణీ చేశారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు.

## నిషేధిత జాబితా నుంచి 66,157 ఎకరాల తొలగింపు

ఈ సమస్యతో రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమై, పెట్టుబడులు రావట్లేదు. దీనికి శాశ్వత పరిష్కారంగా అభ్యంతరాల్లేని ఏపీఐఐసీ భూములను 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు మంత్రిమండలి ఆమోదించింది. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు సౌలభ్యం కలుగుతుంది' అని పేర్కొన్నారు. మంత్రి వెల్లడించిన అంశాలు..

**గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు**

గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.9,355 కోట్లతో 7 మల్టీవిలేజ్ స్కీమ్‌లు (ఎంవీఎస్) చేపట్టాలని నిర్ణయం. వీటిని జేజేఎం, సాస్కీ, ఎన్ఐడీఏ, నాబ్‌ఫిడ్ ఆర్థికసాయంతో చేపట్టాలన్న ప్రతిపాదనకు ఆమోదం. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న 3వేల నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో వివిధ పనుల నిర్వహణకు ఆమోదం. 112 గ్రామీణ నియోజకవర్గాల్లోని 3వేల ప్రాంతాలకు సింగిల్ విలేజ్ స్కీం ద్వారా తాగునీటిని అందించనున్నారు.

**రాజధానిలో నిర్మాణ పనులకు ఆమోదం**

అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ ఏపీ సెక్రటేరియట్, హెచ్ఓడీ కార్యాలయాలలో హైసైడ్ ఎలక్ట్రికల్, హెచ్‌బీఏసీ, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్, లిఫ్టులు, ఫైర్ అలారం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ప్లంబింగ్ వర్క్‌ల కోసం రూ.2,316.88 కోట్లతో డిజైన్ అండ్ బిల్డ్ పద్ధతిలో కాంట్రాక్టు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదించింది. అమరావతిలోని నీరుకొండలో ఈపీసీ విధానంలో ఐదెకరాల్లో 'తెలుగు సాంస్కృతిక కేంద్రం' నిర్మాణాన్ని రూ.119.27 కోట్లతో చేపట్టేందుకు ఆమోదం. 2,000 మంది కూర్చునేలా ఆడిటోరియం, వెయ్యిమందికి సరిపడా ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు తెలుగు భాష మ్యూజియం ఏర్పాటుకు ఆమోదం. సీఆర్‌డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూముల కేటాయింపు. సీబీఎస్ఈ రీజినల్ కార్యాలయానికి 0.80 ఎకరాలు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌కు ఐదెకరాల కేటాయింపు. గతంలో నిడమర్రులో కిమ్స్, ఆదిత్య విద్యాసంస్థలకు కార్పొరేట్ ఆసుపత్రి కోసం 25 ఎకరాల కేటాయింపుల్లో మార్పులు.. రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన స్థలానికి పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి మరో 3 ఎకరాల కేటాయింపు.

**పోలవరం టన్నెళ్లలో అదనపు వ్యయానికి ఆమోదం**

పోలవరం ప్రధాన డ్యాం కుడి కాలువకు నీళ్లు అందించే సొరంగాల్లో ప్యాకేజీ 63 పనులు వేగంగా పూర్తిచేసేందుకు అదనపు గ్యాంట్రీ కొనుగోలు, తొలుత అంచనాల కన్నా అధికంగా లైనింగ్ పని పెరుగుతున్నందున రూ.23.47 కోట్ల అదనపు వ్యయానికి మంత్రిమండలి ఆమోదం. ప్యాకేజీ 64(ఏ)లో కూడా అదనపు గ్యాంట్రీ కొనుగోలు, పని మార్పు వల్ల అదనంగా ఖర్చయ్యే రూ.24.51 కోట్లకు అనుమతి. పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం కుడివైపున జంట సొరంగాలు నిర్మిస్తున్నారు. ప్యాకేజీ 63లో 900 మీటర్ల పొడవున, ప్యాకేజీ 64లో 880 మీటర్ల మేర నిర్మిస్తున్నారు. వీటి ప్రవాహ సామర్థ్యాన్ని 20 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ పనుల వేగం పెంచేందుకు రెండు సొరంగాల్లోనూ చెరో గ్యాంట్రీ అవసరమయ్యాయి. సొరంగం లోపల రాళ్లు దెబ్బతిన్నచోట అదనపు పనులు చేయాల్సి వచ్చింది. ఈ కారణాల వల్ల ఆర్థికభారం పెరిగిందని జలవనరులశాఖ పేర్కొంది. పోలవరం ఎడమ కాలువలో ప్యాకేజీ 8, 8బి ప్యాకేజీల్లో ముందుగా ఒప్పందం ముగించడం, ఈ రెండు ప్యాకేజీల్లో మిగిలిన అత్యవసర పనులను ఎల్ఎస్ పద్ధతిలో టెండర్ల ద్వారా చేపట్టేందుకు తీసుకున్న చర్యలను మంత్రిమండలి ఆమోదించింది. ఈ ప్యాకేజీల్లో మిగిలిన పనులకు రూ.76.87 కోట్లు ఖర్చవుతుందని లెక్కించారు. ధవళేశ్వరం జలవనరుల శాఖ సర్కిల్ పరిధిలో అత్యవసరంగా చేపట్టిన 86 పనులకు రూ.2.55 కోట్లు చెల్లించేందుకు నాణ్యత నియంత్రణ వినియోగ ధ్రువీకరణ పత్రాల నుంచి మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

**మంత్రిమండలి ఇతర నిర్ణయాలు**

ముఖ్యమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 3,500 మంది సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు

## మొదటిపేజీ తరువాయి

యూనిట్ల ఏర్పాటుకు ఆర్థికసాయం అందించాలని నిర్ణయం. దీనికి రూ.300 కోట్ల కేటాయింపు. రాష్ట్రంలోని 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసేవారి కోసం ఈ పథకాన్ని రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మహిళలకు ప్రత్యేక కేటగిరీ కింద మార్జిన్‌మనీ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. సొంత భూముల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారు ఎఫ్‌పీవోలకూ పథకం వర్తింపచేయాలని నిర్ణయం. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కాసిపెంట్లలో ప్రస్తుతం ఉన్న మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌ను రూ.209.68 కోట్లతో విస్తరిస్తోంది. ఆ సంస్థకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద మెగా ప్రాజెక్టు కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదం. ఏపీఎస్‌పీ బెటాలియన్లలో పనిచేస్తున్న 300 మంది హెడ్‌కానిస్టేబుల్ పోస్టులను ఏఆర్ఎస్ఐలుగా స్థాయి పెంచడానికి ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో ప్లాటూన్‌కు ఏఆర్ఎస్ఐల సంఖ్య మూడుకు పెరుగుతుంది. దీనివల్ల శాంతి భద్రతలు, వీఐపీల బందోబస్తు, విపత్తుల సమయంలో కమాండ్ కంట్రోల్ మెరుగవుతుంది.

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్.. త్వరలో భారత్‌కు వస్తానని సందేశం

సూచనప్రాయంగా తెలిపారు. ఇవాళ జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది. గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

## ఖర్గ్ ఐలాండ్‌పై దాడి.. అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఉన్న చమురు కంపెనీల మౌలిక సదుపాయాలు తుడిచిపెట్టుకుపోతాయి. వాటిని బూడిద కుప్పలుగా మార్చేస్తాం' అని హెచ్చరించారు. ఇక, ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ ఐలాండ్‌పై తన ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడి చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇక్కడి చమురు సదుపాయాల జోలికి వెళ్లలేదని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద నౌకల రవాణాను అడ్డుకుంటే మాత్రం.. వాటిని కూడా టార్గెట్ చేస్తామని హెచ్చరికలు జారీచేశారు.

## యుద్ధ ప్రభావం ప్రజలపై పడకుండా మేం చూస్తుంటే, కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది: మోదీ తీవ్ర ఆగ్రహం

మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు
## ఏ ఎన్నికలైనా మనమే గెలవాలి

కార్యదర్శుల పనితీరుపై ఏప్రిల్ 2న కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు ఇస్తామని సీఎం చెప్పారు. దస్త్రాల పరిష్కారం, కీలక పనితీరు సూచీలు (కేపీఐ) లక్ష్యాలను చేరుకోవడం, సాధించిన విజయాలు, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడం, ఖర్చుచేయడంలో చూపించిన చొరవ లాంటి అంశాల ఆధారంగా నివేదికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండేళ్లలో పరిస్థితులన్నీ ఒక దారికి తేగలిగామని, ఇక అభివృద్ధి ఊపందుకోవాలని, 2026-27 కీలక మైలురాయి కావాలని ఆయన పేర్కొన్నారు. మంత్రులు విరివిగా పర్యటనలు చేసి, సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

**చేసింది చెప్పకపోతే ఎలా?**

చాలామంది మంత్రులు తమ శాఖల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి ప్రజలకు సమర్థంగా చెప్పలేకపోతున్నారని, సామాజిక మాధ్యమాల్ని సరిగ్గా వినియోగించుకోవడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ శాఖల పరిధిలో ఏం చేశామన్నది చెప్పుకోవాలి కదా? వాళ్లు (వైకాపా) చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పటికి కొంత గాడిన పెట్టగలిగాం. ఇక మీరు స్పీడ్ పెంచాలి. మీరు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే మెరుగైన ఫలితాలను సాధించగలం" అని సీఎం తెలిపారు. తెదేపా కార్యాలయం నుంచి పంపించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంలో మంత్రులు వెనకబడుతున్నారని, దీన్ని సరిచేసుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు. క్యాబినెట్ భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేశ్, కొల్లు రవీంద్ర, నారాయణ, అధికారులు

**ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార**

ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం నిర్వహించాలని, కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించి, చివరి భూములకూ నీరందేలా చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆదేశాల్లోని ముఖ్యాంశాలు...

రైతులు నారుమళ్లు వేసుకునేందుకు మే 15కి ఎలాగైనా కాలువలకు నీరు విడుదల చేయాలి. వైకాపా ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల్ని నిర్వీర్యం చేయడంతో 6-7 లక్షల ఎకరాలకు నీరందలేదు. వాటన్నింటినీ మళ్లీ రన్నింగ్‌లో పెట్టాలి. రేపల్లె-అవనిగడ్డ ప్రాంతంలో కొన్నిచోట్ల కృష్ణా కరకట్ట బలహీనపడిందని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్. కరకట్ట ఎక్కడెక్కడ బలహీనంగా ఉందో గుర్తించి బలోపేతం చేయాలని సీఎం ఆదేశం. మార్చి 16న అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ. విగ్రహానికి మంచిపేరు ఆలోచించాలన్న సీఎం. ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు. పర్యవేక్షణకు మంత్రులు సవిత, సత్యకుమార్, దుర్గేష్‌లతో కమిటీ.

**వంటగ్యాస్, నిత్యావసరాల కొరత లేకుండా చూడండి**

ప్రపంచం నలుమూలలా తెలుగువారు ఉన్నారు. యుద్ధాల్లాంటి సంక్షోభాలు వచ్చినప్పుడు వారు ఇబ్బంది పడుతున్నారు. వారికి అవసరమైన సహాయం అందించాలి. దీంతోపాటు వంట గ్యాస్, ఇతర నిత్యావసరాలకు కొరత లేకుండా... మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్‌లతో వేసిన కమిటీ పర్యవేక్షించాలి. ఎలక్ట్రిక్ స్టౌల వినియోగం పెరిగినట్టు వార్తలు వస్తున్నాయని మంత్రి కేశవ్ ప్రస్తావించగా... విద్యుత్ వినియోగం పెరుగుతుందేమో చూడాలని, డిమాండ్‌కి తగ్గట్టు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశం.

పంచాయతీల్లో పన్ను వసూళ్లు మెరుగుపడ్డాయని, నీటిసంఘాలతో కూడా నీటితీరువా వసూళ్లు చేయించాలని మంత్రి రామానాయుడికి సీఎం సూచన.

**హెరిటేజ్ అంశం వచ్చినప్పుడు బయటకు వెళ్లిపోయిన చంద్రబాబు, లోకేశ్**

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కాసిపెంట్లలో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ విస్తరణ ప్రాజెక్టుకు రాయితీల అంశం ఎజెండాలో చర్చకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ బయటకు వెళ్లిపోయారు. మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**సమావేశానికి హాజరుకాని ఆరుగురు మంత్రులు**

వ్యక్తిగత పనులు, అనారోగ్య కారణాలతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, ఎన్ఎండీ ఫరూక్, గొట్టిపాటి రవికుమార్, వంగలపూడి అనిత, టీజీ భరత్ మంత్రివర్గ సమావేశానికి హాజరుకాలేదు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)**

నగరంలో శనివారం సాయంత్రం పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ముందుగా 9వ డివిజన్ జర్నలిస్ట్ కాలిని 2వ లైన్ అడ్డ రోడ్డు వద్ద నుండి లైన్ పూర్తిగా రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. 19వ డివిజన్ రెడ్డి హాస్టల్ నుండి వెంగముక్కలపాలెం జంక్షన్ వరకు నందు రూ.1.07 కోట్లతో నిర్మించిన్న సీసీ డ్రైన్ కు ప్రారంభోత్సవ చేయడం జరిగినది. 46వ డివిజన్ రావి ఆంజనేయులు గారి వీధి నందు రూ.14 లక్షలతో నిర్మించునున్న సీసీ డ్రైన్ కు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టడం జరిగింది. శనివారం సుమారుగా రూ.1.46 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, నగర అధ్యక్షులు బందారు మదన్, ఆర్ల వెంకట రత్నం, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## భీమవరం పాఠశాలలో పదో తరగతి పరీక్ష మెటీరియల్ పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 14)**

మండలంలోని భీమవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎస్ఎస్‌సి విద్యార్థులకు శనివారం పరీక్ష మెటీరియల్ అందించిన ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 16వ తేదీ నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు బండి సుబ్బారావు పరీక్షకు కావలసిన ప్లాంక్, పెన్, పెన్సిల్, ఎరేజర్‌తో సహా కంప్లీట్ ఎగ్జామ్ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షలను విజయవంతంగా రాసి 100% ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షలను





రాసి మంచి మార్కులతో పాటు మంచి భవిష్యత్తును పొందాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరావు, దార్ల అంకయ్య, శ్రీధర్, మస్తాన్ వలి, చిట్టిబాబు, హేమలత, సుబ్బారావు, సిబ్బంది, బుజ్జయ్య పాల్గొనగా కార్యక్రమం మొత్తాన్ని మేడికొండ భాస్కర్ పర్యవేక్షించారు.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

15.03.26 ఆదివారం


# గ్యాస్ ఫుల్....ఓటిపి నిల్

- ఓటిపిలు వస్తేనే గ్యాస్ ఇవ్వాలన్న నిబంధన సడలించాలి
- ఆ దిశగా అధికారులు ఆలోచించాలి
- కమర్షియల్ సిలిండర్లు నిలిపివేయడంతో గృహ సిలిండర్లకు డిమాండ్
- బ్లాక్ మార్కెట్‌లో రూ.2 వేలు పలుకుతున్న వైనం
- గ్యాస్ కొరత లేదని చెబుతున్న అధికారులు
- ఓటిపిలు వచ్చేందుకు తీసుకున్న చర్యలు శూన్యం
- దేశంలో 9 శాతం మాత్రమే కమర్షియల్ సిలిండర్ల వాడకం
- 91 శాతం గృహ అవసరాలకు వినియోగం



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మార్చి 14)

జిల్లాలో గ్యాస్ కొరత లేదని కలెక్టర్లు స్పష్టం చేస్తున్నారు....అదే సమయంలో ఓటిపిలు రాకుండా గ్యాస్ ఇవ్వద్దని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలిస్తున్నారు. దేశంలో 9 శాతం మాత్రమే వాడుతున్న కమర్షియల్ సిలిండర్లను నిలిపివేసి 91 శాతం మంది వినియోగించే గృహ వినియోగదారులను ప్రభుత్వాలు ఇబ్బందులు పెడుతున్నాయి. అయితే గ్యాస్ తీసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీల వద్దకు వచ్చే లబ్ధిదారులకు ఫోన్‌లకు ఓటిపిలు రాకపోవడంతో నిజంగా గ్యాస్ అవసరమున్న కష్టమర్లకు కూడా గ్యాస్ ఇవ్వలేని స్థితిలో గ్యాస్ ఏజెన్సీలున్నాయి. వాటిని పరిశీలించాల్సిన అధికార యంత్రాంగం ఆ విషయాలను పక్కనపెట్టి జిల్లాలో గ్యాస్ కొరత లేదని ప్రకటనలు ఇస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ కొరత ఏమీ లేదు. ఇరాన్ యుద్ధం చేస్తుందన్న విషయం దేశం మొత్తం ముందే తెలుసు. కాని దానికి అనుగుణంగా కేంద్రం గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో నిర్ణయాలు తీసుకోవడం ఆలస్యం అయ్యిందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. పైగా ఎన్నడూ లేని విధంగా దేశం మొత్తం మీద 9 శాతం మంది మాత్రమే వినియోగించే కమర్షియల్ సిలిండర్లను రద్దు చేయడంతో ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని విశ్లేషకులు చెబు తున్నారు. వాస్తవానికి కమర్షియల్ సిలిండర్లు కొన సాగించడం వల్ల ప్రభుత్వాలకు గాని వాటిని వినియో గించుకునే హెూటళ్ళ యజమానులకు గాని ఎలాంటి నష్టం లేదు. కమర్షియల్ సిలిండర్లును నిలిపివేయడంతో గృహ సిలిండర్ల పై వ్యాపారులు ఆసక్తి చూపడంతో ఈ సమస్య ఏర్పడింది. వ్యాపారులను మూసి వేయలేక గృహ వినియోగ సిలిండర్ల పై అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించి కొనుగోళ్ళు ప్రారంభించారు. దీంతో గృహ వినియోగ సిలిండర్లు ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రూ.2000 కూడా పలుకుతుంది. దీంతో ప్రజలకు అవసరం ఉన్నా లేకున్నా ఒకే సారిగా కోట్లాది మంది గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేసుకునే క్రమంలో అందుకు సంబంధించిన సర్వర్‌లు సైతం స్తంభించిపోయాయి. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఓటిపిలు వస్తే తప్ప గ్యాస్ ఇవ్వద్దని ఆదేశాలు ఇచ్చారు. ఇదే ఇప్పుడు పెద్ద తప్పుగా మారింది. గతంలో గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులకు కొంత మేర సడలింపులు ఉండేవి. ఓటిపిలు లేకపోయినా మాన్యువల్‌గా రాసుకుని గ్యాస్ ఇచ్చే వారు. కాని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు ఓటిపిలు వస్తేనే గ్యాస్ ఇవ్వాలని షరతులు విధించాయి. దీంతో ఓటిపిలు రాక నిజంగా గ్యాస్ అవసరాలు కల్గిన వినియోగదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి కలెక్టర్లు సరైన సమాచారం అందిస్తే ఈ సమస్య ఉండేది కాదు. అధికారులంతా గ్యాస్ కొరత లేదని ప్రకటనలు ఇస్తున్నారే తప్ప ఓటిపిలు రాని పరిస్థితిని ప్రభుత్వానికి వివరించి ఓటిపిలు సమయానికి వచ్చే విధంగా చూస్తే ఈ పరిస్థితి ఉండదనే అభిప్రాయం విశ్లేషకులు వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి కమర్షియల్ సిలిండర్లను విడుదల చేయడంతో పాటు ఓటిపి రాకుండా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సర్వర్ సమస్యలు లేకుండా చూసి వారికి గ్యాస్ అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మరి ఆ దిశగా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే ప్రభుత్వం కూడా పునరాలోచించి ఆ దిశగా చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

## గ్యాస్ కోసం కంట్రోల్ రూం ఏర్పాటు

**కంట్రోల్ రూం నెంబర్ 9493247765**

**గ్యాస్ నిల్వలు తగ్గాయని, ధరలు పెరుగుతున్నాయన్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు**

**జిల్లాలోని వివిధ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, గ్యాస్ డీలర్లతో సమీక్ష**

**జిల్లాలో గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు**

**ఓటీపీ ద్వారా మాత్రమే సిలిండర్ డెలివరీ తీసుకోవాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మార్చి 14)

ఇరాన్ ఇరాక్ యుద్ధ నేపథ్యంలో జిల్లాలో గ్యాస్ నిల్వలుతగ్గిదని ధరలు పెరుగుతున్నాయన్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్ నుండి జిల్లా పౌరసరఫరాల అధికారి జమీర్ భాషా, జిల్లాలోని వివిధ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, గ్యాస్ డీలర్లతో గ్యాస్ ధరలు గ్యాస్ నిల్వ, ధరలు వంటి అంశాల పై జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జె సి మాట్లాడుతూ ఇరాన్, ఇరాక్ యుద్ధ (తరువాయి 4లో...)

## శ్రీ నెమలి గుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మార్చి 14)

శ్రీ నెమలి గుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసు కుంటామని జిల్లా కలెక్టర్ పి రాజబాబు అన్నారు. శనివారం గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ శ్రీ నేమిలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 2 తేదీ నుండి 5వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు దేవుని మీద భక్తితో తమ మనసులోని కష్టాలు తీరుతాయని నమ్మకంతో దేవాలయాలకు వస్తుంటారని ఆయన అన్నారు. అదే విధంగా స్త్రీ శక్తి పథకం క్రింద ఉచిత బస్సు మహిళలకు ఏర్పాటు చేయడం వల్ల (తరువాయి 4లో...)

## పాదిలిలో వెయ్యేళ్ల నాటి చారిత్రక అన్నవాళ్లను కాపాడుకోవాలి

**నిర్లక్ష్యపు నీడలో పొదిలి చారిత్రక శిల్పాలు, శాసనాలు**

**పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి**



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 14)

పొదిలి మండల కేంద్రంలోని నిర్మ మహేశ్వర, వేణుగోపాల, వీరభద్ర స్వామి దేవాలయాల్లో నిర్లక్ష్యానికి గురైన వెయ్యేళ్ల నాటి శిల్పాలు, శాసనాలను పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. పొదిలికి చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ షేక్ జి మస్తాన్ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శనివారం పొదిలి పట్టణంలోని ఆలయాలను సందర్శించారు. నిర్మమహేశ్వరాలయంలోని వెయ్యేళ్ల నాటి మహిషాసురమర్దిని, మూడు నంది విగ్రహాలు వేంగి చాళుక్యుల శిల్ప సంప్రదాయానికి అద్దం పడుతున్నాయని, వాటిని విడివిడిగా పీఠాలపై నిలబెట్టి, చారిత్రక (తరువాయి 4లో...)

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక**

**పరీక్షలకు హాజరుకానున్న 28,632 మంది విద్యార్థులు**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 14)



పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి సి వి రేణుక తెలిపారు. విద్యాశాఖ అదనపు సంచాలకులు, జిల్లా పరిశీలకులు ఏ సుబ్బారెడ్డి, పరీక్షల నిర్వహణ విభాగ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావులతో కలిసి శనివారం ఒంగోలు సంతపేటలోని డిఆర్ఆర్ఎం. ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీటికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రెగ్యులర్ విభాగ పరీక్షలు, 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఇవి విద్యాపరమైన పరీక్షలు కాబట్టి 30 నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, త్రాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం తగిన రవాణా సౌకర్యం కల్పించామని, ఆర్టీసీ బస్సులలో వెళ్లే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం ఉందన్నారు. హాల్ టికెట్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రాన్ని గుర్తించవచ్చు అన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్ లను మూసివేయిస్తామని, పోలీసుల ద్వారా అవసరమైన బందోబస్తు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

**పరీక్షల నిర్వహణ ఇలా...** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలకు మొత్తం 28,632 మంది విద్యార్థులు హాజరవుతారు. వీరిలో రెగ్యులర్ విభాగంలో 14,289 మంది బాలురు, 14,312 మంది బాలికలు ఉన్నారు. (తరువాయి 4లో...)

# గ్యాస్ కోసం కంట్రోల్ రూం ఏర్పాటు



నేపథ్యంలో గ్యాస్ నిల్వలు తగ్గాయని, ధరలు పెరుగుతున్నాయన్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. జిల్లాలోని ఎల్పిజి గృహ వినియోగదారులు గ్యాస్ కోసం ఇబ్బందులు పడాల్సిన పనిలేదని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ వినియోగదారులు ఓటీపీ ద్వారా మాత్రమే సిలిండర్ డెలివరీ తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సాధారణ గృహ వినియోగదారులకు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, వైద్య విద్య అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిలువచేసినా మరియు అక్రమంగా విక్రయించినా నిత్యవసర సరుకుల చట్టం 1955 క్రింద కేసులు నమోదుచేసి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ తీసుకోవడం లోను బుకింగ్ చేసుకోవడంలో సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము నందు కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 94932 47765నకు సోమవారం నుంచి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు, సి ఎస్‌డిటిలు, వివిధ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, గ్యాస్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రైవేట్ విభాగంలో 21 మంది బాలురు, పదిమంది బాలికలు ఉన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ నుంచి రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన వారు 1144 మంది ఉన్నారు. వీరిలో 823 మంది బాలురు, 321 మంది బాలికలు పరీక్షలు రాస్తారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల కోసం 165 సెంటర్లను, ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల కోసం 14 సెంటర్లను ప్రభుత్వం కేటాయించింది. పబ్లిక్ పరీక్షలు ముగిశాక ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ నాలుగవ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ ఉంటుంది.

# శ్రీ నెమలి గుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మహిళలు ఎక్కువగా దేవాలయాలకు వస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలకు భక్తి భావాలు పెరిగే విధంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని ఆయన చెప్పారు. శ్రీ రంగనాయక స్వామి వారిని దర్శించు కోవడంనాకు చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మో త్సవాలకు సుమారు ఈ సంవత్సరం 70వేల మంది భక్తు లు వచ్చేఅవకాశం ఉందని ఆయన అన్నారు. రంగనాయక స్వామి దేవాలయం అటవీ ప్రాంతంలో ఉందని అటవీశాఖ ఆంక్షలు ఉన్నప్పటికీ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 500 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. బ్రహ్మోత్స వాలకు వచ్చే ప్రజలకు వాహనాలు నిలపడానికి ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అటవీ ప్రాంతంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముంద స్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారులకు కలెక్టర్ చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఏప్రిల్ 2 తేదీ నుండి 5వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు ఎక్కువగా శాతం వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ రంగ నాయక స్వామిదేవాలయం ప్రాంగణంలో సాంస్కృతి కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంతో పాటు టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా రంగనాయక స్వామి దేవాలయ ప్రాంగణా న్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సమావేశంలో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ నెమలిగుండ్ల రంగనా యక స్వామి బ్రహ్మోత్సవాలను కనుల పండుగగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీ నెమలి గుండ్లరంగ నాయక స్వామి బ్రహ్మోత్స వాలకు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధిక సంఖ్యలో ప్రజలు












హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారులను కోరారు. శ్రీ నెమలి గుండ్ల రంగనాయ కస్వామి బ్రహ్మోత్స వాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కంభం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఆయన చెప్పారు. రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ముం దుగా శ్రీ రంగనాయక స్వామి వారిని జిల్లా కలెక్టర్ రాజబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు, గిద్దలూరు అటవీశాఖ అధికారి నిషా కుమారి, మార్కాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి పి ప్రభాకర్, మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం చైర్మన్ నరసింహులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో వెయ్యేళ్ల నాటి చారిత్రక అన్నవాళ్లను కాపాడుకోవాలి

వివరాలతో పేరు పలకలను ఏర్పాటు చేయాలని సంబంధిత ఆలయ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. వీరభద్రాలయంలో సా.శ. 1289 నాటి శాసనం, సా.శ 16వ శతాబ్ది వీరుని శిల్పం నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని, వాటిని కూడా భద్రపరిచి కాపాడుకోవాలన్నారు. పొదిలి చారిత్రక సంతకాలుగా మిగిలి ఉన్న ఈ ఆనవాళ్లను పరిరక్షించి, భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ జ్యోతి చంద్రమౌళి, ఆగమపండిట్ బాలాజీ గురుకుల్, శిల్పి వెంకటరెడ్డి పాల్గొన్నారు.







# గర్భాశయ క్యాన్సర్ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు



(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, మార్చి 14)

చంద్రశేఖరాపురం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నందు 14 సంవత్సరముల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళి మండల టీడీపీ జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరపురం మండలంలోని గ్రామాలలో 14 సంవత్సరాల వయసు గల పిల్లలు అందరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని డాక్టర్ కోరడమైంది. మండలంలో 14 సంవత్సరాల బాలికలు 180 మంది ఉన్నారు. ఈ రోజు 12 మందికి టీకా ఇవ్వడం జరిగింది. ఇదే విధంగా ఈ కార్యక్రమం వారానికి ఒక సారి జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి సూపర్వైజర్ ఉమామహేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ కె కొండయ్య, జి రామకృష్ణ పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, అప్కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

### సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు, మెడికల్, హెల్త్ సంఘాల గౌరవ అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

ఐక్య వైద్య ఆరోగ్య సంఘాల సమావేశం శనివారం ఒంగోలు నగరంలోని అంబేద్కర్ భవనం నందు యుఎంహెచ్ఈయు జిల్లా అధ్యక్షులు వై సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, అప్కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి అని, ఈ లోపు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ , అప్కాస్ ఉద్యోగుల కు వంద శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగుల కోసం పీఆర్‌సీని నియమించి ఐఆర్ నివ్వాలని, సచివాలయం హెల్త్ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలని, వైద్య ఆరోగ్య శాఖ విధులు మాత్రమే చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం.సుబ్బారావు, యుఎంహెచ్ఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారి సుభాషిణి, యుఎంహెచ్ఈయు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, కోశాధికారి నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సంఘం జిల్లా నాయకులు వెంకట్రావు, బాలాజీ, మాధవరావు, పి బ్రహ్మయ్య, యుపీహెచ్‌సీ సంఘం జిల్లా నాయకులు సురేంద్ర, హనుమంతరావు, కాంట్రాక్ట్ నాయకులు శేషయ్య, మంత్రునాయక్, జిల్లా నాయకులు ఏడుకొండలు, రెండవ ఏఎన్ఎంల సంఘం జిల్లా నాయకురాలు ఎ లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు
# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 14)**

ఈ నెల మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రతీ రోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం12.45 గంటల వరకు నిర్వహించు పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలియజేసారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరుపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సిబ్బంది తో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. మార్కాపురం జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు ఇతర శాఖల సమయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసామని, మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి హాజరు కావాలని, కావున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతో పాటు పరీక్ష విధులు నిర్వహించే అన్ని

**జిరాక్స్ సెంటర్లు మూసివేత**
**పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు,**
**పరీక్షకు కేటాయించిన సిబ్బంది మాత్రమే ఉండాలి**
**పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న**
**విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలిపిన జిల్లా ఎస్పీ**
**పరీక్షా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**
**ఉల్లంఘించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం**
**మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**




శాఖల సిబ్బంది పదవ తరగతి పరీక్షల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు, పరీక్షలకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది లేదా వ్యక్తులు ఉండరాదని తెలిపారు.

అలాగే చిట్టీలు, పుస్తకాలు వంటి వాటిని ఉపయోగించి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు విద్యార్థులు ఎవరైనా పాల్పడినా, లేదా వారికి ఎవరైనా సహకరించినా, వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ, 10వ తరగతి మార్చి 2026 పరీక్షలు మార్చి 16 నుండి 28 వరకు నిర్వహించబడతాయి. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. పరీక్షా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. మార్కాపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే 100, 112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

## పేకాట శిబిరం పై దాడి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 14)**

మండలంలోని చెరుకూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వటంతో పోలీసులు పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుండి రూ.3,010 నగదును స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రకాశం జిల్లా ఆర్‌వైఎస్ఎఫ్ జిల్లా నూతన అధ్యక్షులుగా రాజ్ విశాల్ నియామకం

**విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదాం**
**యువతకు ఉపాధి అవకాశాల కల్పనకై పోరాడదాం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)**




శనివారం జరిగిన ప్రకాశం జిల్లా మొదటి మహాసభ ఆర్‌వైఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రారంభించిన ఆర్‌వైఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ రోజున విద్యా వ్యాపార వస్తువుగా మారింది. విద్యా వ్యాపారం కాదు అని పుస్తకాలకు మాత్రమే పరిమితి అయ్యింది. విద్యా ప్రైవేట్, కార్పొరేట్ వ్యాపారవేత్తలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అడ్మిషన్ టెస్ట్ పేర్లతో విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను భయపెట్టి, కొన్ని వేల రూపాయలు పుస్తకాలకు, లక్షల రూపాయల కాలేజీ, స్కూల ఫీజులు వసూలు చేస్తూన్నారు. 2025 -26 అకడమిక్ ఇయర్ పూర్తి కాకముందే 2026-27 సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారు,పుస్తకాలు వేల రూపాయలకు అమ్మిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు నిద్ర వీడి ఆన్ రికగ్నిస్డ్ స్కూల్, కాలేజీ లపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశ తీర్మానంలో రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందించి జిల్లా అధ్యక్షులుగా పి రాజ్ విశాల్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పి రాజ్ విశాల్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థి, యువజన సమస్యలపై పూర్తి స్థాయిలో పని చేస్తానని, తన మీద రాష్ట్ర కమిటీ ఉంచిన బాధ్యతను విద్యార్థి, యువజన సమస్యలపై పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నవదీప్, జెస్వంత్, మహేష్‌రెడ్డి, నాగరాజు, ఇమ్మాన్యేల్, నాని, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 14)**

యర్రగొండపాలెంలోని స్థానిక ప్రజా వైద్యశాలను యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా కలుసుకొని వారి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో వివరంగా విచారించి, అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అలాగే ఆసుపత్రిలోనీ జనరల్ వార్డ్, డయాలసిస్ విభాగం, క్యాజువాలిటీ, రక్త పరీక్ష ల్యాబ్, పరిశుభ్రత, వైద్య సదుపాయాలు వంటి విషయాలను కూడా పరిశీలించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు.నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎరిక్షన్ బాబు తనిఖీలు చేస్తుండడంతో సిబ్బంది ఉరుకులు, పరుగులు పెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగల్‌రెడ్డి, పుల్లలచెరువు మండల టిడిపి అధ్యక్షులు పోట్ల గోవిందు, త్రిపురాంతకం మండల టిడిపి అధ్యక్షులు మేకల వలరాజు, దోర్నాల మండల టిడిపి అధ్యక్షులు షేక్ మాబు, పెద్దారవీడు మండల పార్టీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







## పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే ఏలూరికి ఆహ్వానం



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మార్చి 14)**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతిలో ఏర్పాటు చేసిన 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆహ్వానించారు. తుళ్లూరు, పెద్దపరిమి రోడ్డులోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని మార్చి 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మార్టూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములుకి నివాళులర్పించాలని వారు కోరారు.

## 60 మంది వాహనదారులకు జరిమానా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 60 మందిని శనివారం కోర్టు వారి వద్ద హాజరు పరచగా 60 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.6లక్షల జరిమానా విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్ తెలిపారు. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవీ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీ సాయి హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజ







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 14)**

రాబోయే ఎస్ఎస్‌సి (10వ తరగతి) పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు విజయవంతంగా ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ ఉలవపాడు శ్రీ సాయి హై స్కూల్, ఆధ్వర్యంలో శనివారం సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ, కేశవరపు జాలిరెడ్డి, 10వ తరగతి విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, మంచి ఫలితాలు సాధించాలని కోరుతూ సాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ, మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ విద్యార్థులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఇతరులు కూడా పాల్గొన్నారు.

# ఉప్పుటూరులో ఉర్దూ ఘర్ నిర్మాణానికి భూమి కేటాయింపు

## ఆర్డీఓ ఉత్తర్వులు

## ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన నాయకులు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మార్చి 14)

పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా నిర్మాణానికి భూమి కేటాయిస్తూ బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలోని సర్వే నం.19/5లో ఉన్న 0.59 ఎకరాల మందబయలు పోరంబోకు భూమిని ప్రభుత్వ వినియోగ భూమిగా మార్చి మైనారిటీ వెల్ఫేర్ శాఖకు కేటాయించారు. ఒంగోలు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ప్రతిపాదన మేరకు ఉర్దూ ఘర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ భవనం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించేందుకు తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్ పరిశీలన జరిపి ఈ భూమిని గుర్తించారు.

గ్రామంలో సుమారు 250 ముస్లిం కుటుంబాలు (దాదాపు వెయ్యి మంది జనాభా) ఉండగా, కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా నిర్మాణానికి భూమి కేటాయించారు. ఈ మేరకు పర్చూరు తహసీల్దార్ గ్రామ, మండల రికార్డులతో పాటు వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో అవసరమైన మార్పులు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ముస్లిం నాయకులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో చెన్నారెడ్డి ప్యానల్‌ను బలపరచాలి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 14)

త్వరలో జరగనున్న కడప జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు చెన్నారెడ్డి నాయకత్వంలో రూపొందించిన ప్యానల్‌ను బలపరచాలని గవర్నమెంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి రామ్మూర్తి నాయుడు కోరారు. శనివారం బద్వేల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ దారులకు సకాలంలో డీఏలు అందేలా రాష్ట్ర సంఘం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ల కృషితో ఏప్రిల్ నెలలో ఒక డీఏ మంజూరు అయ్యే అవకాశముందని తెలిపారు. త్వరలో పెన్షన్ దారులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం జీవోలు జారీ చేసే అవకాశం ఉందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కడప జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో అందరూ సహకరించాలని, సాధ్యమైనంత వరకు సామరస్యంగా ఎన్నికలు జరగాలని కోరారు. ఒకవేళ ఎన్నికలు జరిగితే చెన్నారెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని, అధ్యక్షుడిగా రామ్మూర్తి నాయుడు, కార్యదర్శిగా నాగమణి రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, గౌరవ సలహాదారు గడి పుల్లమ్మరాజు, కోశాధికారి గంగన్న, ఉపాధ్యక్షులు ముండ్లపాటి పిచ్చయ్య, ఆనందరావు, రాఘవరెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి, సుబ్బరాయుడు, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఆప్తల్మాలజీ కంటి విభాగం ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

ఒంగోలు గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ నందు ఆధునిక సదుపాయాలతో కూడిన ఆప్తల్మాలజీ కంటి విభాగంను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ విభాగంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు డాక్టర్ పురాణపు మహిత ఆధునిక పరికరాల ద్వారా రోగులకు మెరుగైన కంటి చికిత్స అందించబడుతుంది. కంటి పరీక్షలు, కంటి సంబంధిత వ్యాధుల నిర్ధారణ, కంటి అద్దాలు తో పాటుగా అన్ని రకాల కంటి ఆపరేషన్లు, ఇతర ప్రత్యేక సేవలు ఈ విభాగంలో అందుబాటులో ఉంటాయి. వీటి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించబడతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సీనియర్ కంటి వైద్య నిపుణులు జె దుర్గా ప్రసాద్ డిపార్టుమెంటును ప్రారంభించారు, కన్సల్టేషన్ ఛాంబర్ ను కంటి వైద్యులు డాక్టర్ మహిత తల్లిదండ్రులు పురాణపు విశ్వం, అమృతవల్లి ప్రారంభించారు. మిషినరీని, ఆప్టికల్స్ షాప్‌ను సీనియర్ ఎముకలు, కీళ్ళ మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీ కృష్ణ అన్నయ్యలు చాపల శ్రీనివాస రావు, కోటేశ్వరరావు ప్రారంభించగా కంటి ఆపరేషన్ థియేటర్‌ను సీనియర్ గర్భ కోశ, ప్రసూతి, సంతాన సాఫల్యత వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి తల్లిదండ్రులు జేనికి ఒన్నూరప్ప, కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు, సీనియర్ ఎముకలు, కీళ్లు, నరములు, కీళ్ల మార్పిడి, యాక్సిడెంట్ , వెన్నెముక శస్త్ర చికిత్సా నిపుణులు, చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ప్రత్యేక విభాగాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కంటి సంబంధిత సమస్యలు, సందేహాలకు 24/7 హెల్ప్ లైన్ 8184 82 82 82 నందు సంప్రదించాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనరల్, ఫ్యామిలీ ఫీజీషియన్, షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ సానల ధీరజ్ బాబు , జనరల్ డాక్టర్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ దోనె సృజన్, చిన్న పిల్లలు, పురిటి బిడ్డల వైద్య నిపుణులు డాక్టర్ నరహరి వెంకట సుస్మిత, అనస్థీషియా, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ముప్పరాజు దీప్తి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, మేనేజర్ డాక్టర్ కొపోల్లు సౌమిత్ర పల్లవ్, డెంటల్ డాక్టర్ కాస్మొటిక్ సర్జన్ డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, ఫీజియోథెరపీ వైద్య నిపుణులు డాక్టర్ పొక్కిన గారి ఏడుకొండలు, ప్రజలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం





వెలుగు, గోపవరం, మార్చి 14)

పట్టణ పరిధిలోని శనివారం శీలంవారిపల్లి హరిజనవాడ లో జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పేదల మధ్య కేక్ కటింగ్ మరియు 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బద్వేల్ జనసేన యువతరం నాయకులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, దద్దం నాగార్జున, బాల చెన్నయ్య ఆధ్వర్యంలో జనసేన సీనియర్ నాయకులు తుడిమెల్ల మురళీ కృష్ణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సాధారణ పార్టీగా స్థాపించి ఏ అండ లేకుండా ప్రస్తుతం అసాధారణ రీతిలో జనసేన పార్టీ ఉందంటే అది పవన్ కళ్యాణ్ నాయకత్వం వల్లే సాధ్యమైందన్నారు. రాబోయే రోజులలో పార్టీ అభివృద్ధికి ప్రతి జన సైనికుడు మరింత పాటుపడి ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన నాయకులు మఠం సత్రం చైర్మన్ డాక్టర్ అశోక్, నీటి సంఘం చైర్మన్ కొర్రపాటి సురేంద్ర, ఏఎంసి డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, గోపవరం జనసేన నాయకులు పి మనోహర్, శ్రీకాంత్ రెడ్డి బద్వేల్ జనసేన యువ నాయకులు వాయిలేటి శ్రీనివాసులు, తుడిమెళ్ళ సురేంద్ర, మస్తాన్, వంశీకృష్ణ, సింగంశెట్టి సుధీర్‌లు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు సాగు భూములు పంచాలి

## సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు సాగు భూములు పంపిణీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి జిపి రామారావు అన్నారు .శనివారం గడపగడపకు సిపిఐ కార్యక్రమంలో కనిగిరి పట్టణంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సమస్యలను తెలుసుకోవడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాల కావస్తున్నప్పటికీ నేటికీ పేదలకు ఇంటి స్థలాలు సాగు భూములు ఇవ్వలేదని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను నేటికీ అమలు చేయలేదని వారు విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు అర్హులైన పేదలందరికీఇంటి స్థలం ఇవ్వాలని, కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమిని పంపిణీ చేయాలని అన్నారు. గడపగడపకు సిపిఐ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నదని 23వ తేదీ వరకు ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి 24వ తేదీ తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు ఇవ్వాలని వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని, ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చాలని కనిగిరి పట్టణ అభివృద్ధికి పెద్ద చెరువు నాగుల చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. రానున్న వేసవిలో దృష్టిలో పెట్టుకొని పట్టణములో ఉన్న ప్రజలకు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్, మహిళా సమాఖ్య నాయకులు షేక్ బషీర, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరా పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## తహసిల్దార్ టి శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 14)

దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి దృష్ట్యా కుటుంబ అవసరమైన గ్యాస్ సరఫరా పై ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని తహసిల్దార్ టి శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయమై ఉలవపాడు మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా ప్రస్తుతం దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు గ్యాస్ నిల్వలు సరిపడినంతగా ఉన్నవని భారత ప్రభుత్వం తెలియజేయడం జరిగింది. కాబట్టి ప్రజలు గ్యాస్ సరఫరాకు సంబంధించి ఏ విధమైన ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అనవసరంగా భయపడి అవసరం లేకపోయినా గ్యాస్ బుక్ చేయవలసిన అవసరం లేదని తెలియజేశారు. ఈ విషయమై ఫిర్యాదులు ఏవైనా ఉన్నా లేదా గృహ అవసర గ్యాస్ ఎక్కడైనా వ్యాపార అవసరాలకు గాని, బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్1077 కి కానీ, స్థానిక రెవిన్యూ అధికారులకు కానీ ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

# విప్లవ కవి పిన్నిక కుటుంబానికి రూ.50వేలు సహకారం అందించిన దళిత నేత నీలం

## పీడిత విప్లవప్రవాహం పిన్నిక శ్రీను

### దళిత నాయకుల నివాళులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

ఇటీవల అకస్మాత్తుగా మరణించిన విరసం నేత పిన్నిక శ్రీను కుటుంబానికి దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు 50 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. శనివారం చీమకుర్తిలోని పిన్నిక శ్రీను కుటుంబసభ్యులను పరామర్శించారు. తదనంతరం జరిగిన స్మారక కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పిన్నిక శ్రీనివాస్ రాడికల్ యోజన సంఘం లో పనిచేశాడన్నారు. అనేకసార్లు పోలీసు కేసులకు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడేరన్నారు. సాధారణంగా ఎస్సి కులాలలో చైతన్యవంతులైన వారు విప్లవ ఉద్యమం పట్ల ఆకర్షితులవుతారు కానీ యాదవ కులస్తుడైన పిన్నిక శ్రీను సామాజిక స్పృహతో యుక్త వయసు నుండి మరణించే వరకు విప్లవ బాటలోనే పీడిత ప్రజల తరఫున పోరాటాలకు గొంతుకగా నిలిచాడన్నారు. చీమకుర్తి క్వారీలో ముగ్గురు యువతుల మరణాలు ఘటనతో పిన్నిక శ్రీను పోరాట ప్రతిమతో ప్రజలతోపాటు ప్రభుత్వానికి కూడా తెలిసిందన్నారు. చీమకుర్తి ప్రాంతంలో 1996వ సంవత్సరంలో జరిగిన మాదిగల పై దాడి మైలవరం సాంఘిక బహిష్కరణ మాదిగలపై దాడి ఘటనలో అగ్రకుల నిందితులను అరెస్టు చేయటానికి చీమకుర్తి లో జరిగిన ఉద్యమంలో తమతో పాటు పిన్నిక శ్రీను ప్రధాన పాత్ర పోషించాడన్నారు. అలాగే తూర్పు నాయుడుపాలెంలో జరిగిన మేరీలీల హత్య కేసులో జరిగిన పోరాటంలో కూడా స్థానిక విప్లవ ప్రతిఘటన సంఘాలు వ్యతిరేకించిన పిన్నిక శ్రీను మాత్రం మేరీలీల హత్యపై జరిగిన ఉద్యమానిక తన వంతు సహకారం అందించాడన్నారు. చీమకుర్తి పక్క మండలమైన తాళ్లూరు




మండలం తురకపాలెం గ్రామంలో దాసరి శివయ్య అనే దళిత యువకుడుని అగ్రకుల హంతక రెడ్ల ముఠా హత్య చేసి శవాన్ని మాయం చేసిన ఘటనకు వ్యతిరేకంగా జరిగిన సుదీర్ఘ పోరాటంలో విప్లవ పార్టీలు మౌనవ్రతం వహించిన పిన్నిక శ్రీను మాత్రం ఇవీ తో పాటు కలిసి తురకపాలెం అగ్రకుల హంతకులను అరెస్టు చేసేదాకా తమతో ఉన్నారన్నారు. అలాగే మార్కాపురం మండలం రాజుపాలెంలో మాదిగలపై జరిగిన సామూహిక దాడి సాంఘిక బహిష్కరణ ఘటనలపై ఒంగోలు ఎస్పీ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని తమతోపాటు ముద్దాయిగా కోర్టు చుట్టూ తిరిగాడు అన్నారు. ఆలకూరపాడు లో జరిగిన విరసం మహాసభలు సభలు విజయవంతం అవ్వటానికి కూడా ఎన్నిక శ్రీనివాస్ నిరంతరం కృషి చేశాడు అన్నారు. అలాగే రాష్ట్రంలో దళిత మైనార్టీలపై జరిగిన దాడులపై రాజ్యానికి వ్యతిరేకంగా జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొనేవాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాలతో మమేకమై వారి సమస్యల పట్ల సహకారం అందించేవాడు అన్నారు. నిరంతరం తన కుటుంబం గురించి కాకుండా ప్రజా సమస్యలపై ప్రభుత్వ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలలో ముందుండే విప్లవ సైనికుడు శ్రీనివాస్ అని పిన్నిక శ్రీనివాస్ మరణం విప్లవ ప్రజా ఉద్యమాలకు తీరని లోటుని దళిత నేత నీలం నాగేంద్రరావు నివాళులర్పించారు. పిన్నిక శ్రీనివాస్ కుమార్తెలైన ఇంద్రవెల్లి, కవితలను పరామర్శించి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా పిన్నిక శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, వివిధ సంఘాల నాయకులు పేరం శ్రీనివాసరావు, తోరటి ఆనంద్ మాదిగ, ఐక్యవేదిక బండ్ల కొండలరావు, పాటిబండ్ల గంగయ్య, దాసరి రవి, బక్క రత్నం, ఎల్లమంద బాబు, దేవరపల్లి రావణ, బొమ్మల వంశీ, తదితరులు ఉన్నారు.

# బస్ షెల్టర్‌లో ఇబ్బందులు తొలగింపు

# ఆక్రమణల తొలగింపుతో సమస్యకు చెక్

### ఎమ్మెల్యే, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ప్రయాణికులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

ఒంగోలులోని రిమ్స్ హాస్పటల్ సమీపంలోని బస్ షెల్టర్‌లో ప్రైవేట్ వ్యక్తులు, చనిపోయిన వ్యక్తులకు ఉపయోగించే ఫ్రీజర్‌లు, అంబులెన్సులు అడ్డుగా పెట్టడంతో ప్రయాణికులు కూర్చోడానికి, బస్ ఎక్కేందుకు ఇబ్బందికరంగా ఉందని స్థానిక 15వ డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణకి అక్కడ ప్రజలు తెలియపరచడంతో ఆ విషయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావుకి, కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకోని వెళ్లడంతో వెంటనే మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ వెంకటేశ్వరరావు బస్ షెల్టర్‌లో ఉన్న ఫ్రీజర్స్ చుట్టుపక్కల ఉన్న అంబులెన్స్‌ను, తోపుడు బండ్లను అడ్డు లేకుండా క్లియర్ చేయించారు. ప్రయాణికులు బస్ షెల్టర్‌లో కూర్చొడానికి ఇబ్బంది లేకుండా బస్, ఎక్కే విధంగా చర్యలు తీసుకున్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే రెస్పాన్స్ అయ్యి స్పందించిన ఎమ్మెల్యే, కమిషనర్, డివిజన్ అధ్యక్షుడుకి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేశారు.










# నాగెళ్ళముడుపు జడ్పీ పాఠశాల

# విద్యార్థినికి నగదు బహుమతి

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మార్చి 14)

మండలంలోని నాకేళ్ళముడుపు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2025 ఎస్ఎస్సి పబ్లిక్, పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి పాఠశాలలో మొదటి స్థానం సాధించిన కంభపాటి ఎస్తా అనే విద్యార్థినికి సేవ స్వచ్ఛంద సంస్థ, (సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంటల్, విలేజ్, యాక్టివిటీస్) సంస్థ డైరెక్టర్ కందుల అనిల్ కుమార్, వారి తండ్రి స్వర్గీయ కందుల పెద్దయేసు జ్ఞాపకార్థం ఆ అమ్మాయిని శాలువతో సన్మానించి, మేమెంటోతో పాటు రూ.5,000ల నగదు డబ్బులను ప్రోత్సాహ బహుమతిగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ 2025 బ్యాచ్‌తో 10వ తరగతి ప్రారంభించడం జరిగిందని, ఇలాగే ఈ పాఠశాలలో భవిష్యత్తులో కూడా ప్రతి ఏటా 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థిని, విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో మా తండ్రి జ్ఞాపకార్థంగా ఇదే విధంగా ప్రోత్సాహ బహుమతులు కొనసాగించడం జరుగుతుందన్నారు. విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరూ పాఠశాలలో ఉత్తమ ప్రతిభను చాటాలన్నారు. గతంలోని వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ ఫలితాలను సాధించిన యెడల మీ తల్లిదండ్రులతో పాటు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు గడించాలని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కందుల కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ ఆదినారాయణ, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.










## సోమవారం జరిగే యాదవ ధర్నాను విజయవంతం చేయండి

### గోపికృష్ణ యాదవ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)

ఈ నెల 16వ తేదీన ఒంగోలు కలెక్టరేట్ వద్ద మార్కాపురానికి కాటమరాజు జిల్లాగా నామకరణం చేయాలని ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాదవ జేపీసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన యాదవ వీరుడు కాటమరాజు పేరు మార్కాపురం జిల్లాకి పెట్టాలనేది ఈ రాష్ట్రంలోని లక్షలాది మంది యాదవుల కోరిక అని , ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే మార్కాపురాన్ని కాటమరాజు జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని యాదవులు, కాటమరాజు భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జనసేన పార్టీ యూత్ అధ్యక్షులు నక్క శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 14)

యర్రగొండపాలెం పట్టణంలో శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జనసేన పార్టీ అధినేత,ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వీర అభిమాని నక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఏరియా









వైద్యశాల వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. పార్టీలో సభ్యత్వం ఉన్న వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తాన్ని జనసేన ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పారు. భవిష్యత్తులో పార్టీ ఎక్కువ స్థానాలను కైవసం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి క్రిస్టఫర్, రాము, తిమోతి, వెంకటేశ్వర్లు, చెన్నయ, లాలా, అంజి, పాల్గొన్నారు.


## వధూవరులను ఆశీర్వదించిన బుర్రా



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 14)

మండలంలోని చాకిచర్ల గ్రామంలో చల్లా పెద్దకోటయ్య నాగరతమ్మల కుమారుడు హరికృష్ణ త్రివేణి వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆశీర్వదించారు. ఆయన వెంట కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉలవపాడు మండల వైసిపి నాయకులు, చాకిచెర్ల గ్రామ నాయకులు నల్లపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సన్నిబోయిన మాధవ, చిలుకోటి వెంకటేశ్వర్లు, తోటా రమేష్, తోట మల్లికార్జున, తోట నారాయణ, మిరియం సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, మార్చి 14)
ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కోయిలంపాడు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్, కోయిలంపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు బాలకేశవరెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు మాలకొండయ్య, టిడిపి సీనియర్ నాయకులు పోకల మాలాద్రి, కోయిలంపాడు నీటి సంఘం చైర్మన్ దోనపాటి మోహన్‌రెడ్డి , పాలపర్తి నారాయణరావు, షేక్ నాయబ్ రసూల్, గురు కృష్ణ, చందలూరు బాలకాశయ్య, గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు భారీ ఎత్తున ఇఫ్తార్ విందు ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 14)
పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని షాది ఖానాలో ముస్లిం సోదరులకు భారీ ఎత్తున ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ భాష తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు షేక్ జాన్ సైదాను శుక్రవారం ఆహ్వానించడం జరిగింది. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా షేక్ జానీ భాష కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ మైన, నాగూర్ భాష, రామా టాకీస్ జానీ, గొర్రె జానీ, కరిముల్లా, షేక్ నాగూర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## వల్లేరవారిపల్లిలో ఘనంగా ముగిసిన పాల్గుణ మాసం పూజలు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, మార్చి 14)
కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం మండలం వల్లేరవారిపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాల్గుణ మాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం వైభవంగా ముగిశాయి. పాల్గుణ మాసంలోని ఐదవ, చివరి శనివారం సందర్భంగా ఆలయంలో హోమాలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ పాల్గుణ మాసం మొత్తం స్వామివారికి పలు విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే రానున్న తెలుగు నూతన సంవత్సరం శ్రీ పరాభవనామ సంవత్సరం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులందరికీ మంచి ఆరోగ్యం, ఐశ్వర్యం కలిగి, అష్టకష్టాలు తొలగి పాడిపంటలతో సుఖసంతోషాలతో జీవించాలని దేవుని ఆశీస్సులు కోరారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలువురు ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలు

### అర్బన్ సిఐ రామకృష్ణ

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 14)
రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో బద్వేల్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చిన్న వయసు నుండి కష్టపడి చదువుకున్నప్పుడే అనుకున్నా లక్ష్యాలను నెరవేర్చు కోగలుగుతారన్నారు. రత్నం స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి అర్బన్ సీఐ, కడప డయాసిస్ ఛాన్సెలర్ రెవరెంట్ ఫాదర్ యల్ ఆరోగ్య రాజ్, టేకూర్ పేట్ మెడికల్ ఆఫీసర్ టి శ్రీ విద్య, పివియన్ ప్రసాద్, ప్రొద్దుటూరు ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ సూపరిండెంట్ వాణి రత్నం ముఖ్య అతిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాలని, చదువుతోనే ఏదైనా సాధించవచ్చని, మనిషి మనుగడకు చదువు, సంస్కారం ఎంతో అవసరమని సూచించారు. మార్చి నెల 16 వ తేది నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని విద్యార్థులు చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఒక సైనికుడికి ఆయుధం ఎంత అవసరమో ప్రతి విద్యార్థికి పరీక్షల కొరకు అభ్యసన అనే ఆయుధం ద్వారానే జ్ఞానం మరియు శక్తిని సంపాదిస్తారని, అభ్యసన ద్వారానే మానసిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. తద్వారానే విజయం సునాయసన మవుతుందని పేర్కొన్నారు. న్యాయవాది పి. వి. యన్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, అందుకు తగ్గట్టుగానే తన ఆలోచన, తపన ఉండాలన్నారు. చదివింది చదవాల్సింది మాత్రమే గుర్తుకు రావాలని, అర్థం కాని అంశాలను గురువులను గాని లేదా తన తోటి విధ్యార్ధులను గానీ అడిగి తెలుసుకొని అర్థమయ్యేంత వరకు పట్టు వదలని విక్రమార్కుడిలా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ టి. రత్నం మాట్లాడుతూ ఈ పరీక్షల సమయం విద్యార్థులకి అత్యంత విలువైన సమయమని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాఠ్యంశాలను ప్రణాళికాబద్ధంగా చదివి, పూర్తి సమయాన్ని కేటాయించుకోవాలన్నారు.



విద్యార్థుల అభ్యసన ఎంత బలంగా ఉంటే అంత ఎక్కువ ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. అభ్యసన వలన ఆత్మవిశ్వాసం అమాంతం పెరిగి, పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. టేకూర్ పేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి శ్రీవిద్య మాట్లాడుతూ నేటి కాలంలో అవసరానికి మించి వాడుతున్న పరికరం మొబైల్ ఫోన్ అని, ఇది సమయాన్ని వృధా చేయడమే కాకుండా, చదువుపై ఏకాగ్రత లేకుండా చేస్తుందని, మెదడుపై, కంటి చూపుపై ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ప్రస్తుతం పరీక్షలు పూర్తి అయినంత వరకు పక్కన పెట్టకపోతే సంవత్సరం మొత్తం కష్టపడ్డ శ్రమ వృధానే అవుతుందన్నారు. కాబట్టి విద్యార్థులందరూ కష్టపడి ఇష్టంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జి సుబ్బయ్య, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు సరోజమ్మ, బ్యూలా, అనూష, కల్పన, లాల్‌బూ, అంజలి, రాజ కుమారి, నాగలక్ష్మి, జిలాని, రజియా, హరిత, పార్వతి, హరిక్రృష్ణ, శివ కుమార్, నాగరాజు, నాగయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కాలనీల్లో పనుల వేగవంతానికి చర్యలు తీసుకోండి

### అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 14)
వెలుగొండ ప్రాజెక్టు గ్రామాలకు కేటాయించిన పునరావాస కాలనీల్లో పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో వెలుగొండ ప్రాజెక్టు సిబ్బందితో పాటు మార్కాపురం, పెద్దారవీడు, అర్ధవీడు మండలాలకు చెందిన రెవిన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగొండ ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాలు, వాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటి వరకు ఎంత డబ్బులు, చెల్లించారు. ఇంకా ఎంత చెల్లించాలి వంటి అంశాలను వెలుగొండ ప్రాజెక్టు అధికారులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జూలై నాటికి ప్రాజెక్టు ద్వారా నీరు వస్తే గ్రామాల పరిస్థితి, ఉన్న రోడ్ల అనుసంధానం, ఇతర మార్గాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటుందని దానికి అనుగుణంగా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా పునరావాస కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వీటి పై రెండు రోజుల్లో ఒక నివేదిక సిద్ధం చేయాలని దాన్నిబట్టి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. మండలంలోని వీఆర్వోలు పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా అర్జీదారులను పదేపదే తిప్పుకోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్ట్ ఎస్ఈ అబు తలీం, మార్కాపురం ఎస్‌డీసీ సత్యనారాయణ, కనిగిరి ఆర్‌డీఓ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువ భారత్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 14)
మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నందు పదవ తరగతి చదువుతున్న సుమారు 60 మంది బాలబాలికలకు యువభారత్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్ ప్యాడ్, పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్స్‌లను అందించారు. యువ భారత్ సొసైటీ కార్యదర్శి వాయిరీ రామక్రిష్ణ మాట్లాడుతూ యువ భారత్ నేతృత్వం లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అదే విధంగా ఈ రోజు పెద్దారవీడు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరీక్షా కిట్ల ను అందజేయడం జరిగింది, పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులై ఉన్నతమైన చదువులు చదివి వారు చదువుకున్న పాఠశాలకు, గ్రామానికి, దేశానికి ఉపయోగపడాలని విద్యార్థులకు సూచించారు, అలానే పేద విద్యార్థులకు ఈ సొసైటీ ఎప్పుడు అండగా ఉంటుందని అలానే ఉన్నతమైన చదువులకు సహకరిస్తుందని మున్ముందు అనేక కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పేద విద్యార్థుల కోసం పదవ తరగతి పరీక్షల దృష్ట్యా అవసరమైన మెటీరియల్ అందించినందుకు సహకరించిన గొట్టం రామనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి ఆంజనేయ రెడ్డి, గాజుల పల్లి శ్రీను, గోగులమూడి బ్రహ్మారెడ్డి, జ్యోతి రాజు, వేసపోగు రామయ్య, కొలిపేర సాయి, బత్తుల పాలంకయ్య, పాఠశాల సిబ్బందికి సొసైటీ అధ్యక్షులు జివి రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## దుగ్గిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, మార్చి 14)
మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుగ్గిరెడ్డి శ్రీనివాసులురెడ్డి అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శనివారం వారి నివాసానికి చేరుకుని వారి కుటుంసభ్యులను కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు బోబ్బూరి రమేష్, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# గ్యాస్ గోడౌన్‌లను తనిఖీ చేసిన ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్










**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 14)**
ప్రకాశం జిల్లా పౌరసరఫరాల, సివిల్ సప్లయ్స్ అధికారి వారి ఆదేశాల మేరకు కందుకూరు మండలంలోని వరసిద్ధి వినాయక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ, భారత్ గ్యాస్ ఏజెన్సీలను ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్, విజయభాస్కర్ శనివారం తనిఖీ చేశారు. ఏజెన్సీ గోడౌన్‌లో నిల్వ ఉన్న గృహ వాణిజ్య సంబంధ గ్యాస్ సిలిండర్లను పరిశీలించారు. బుకింగ్ వివరములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ విజయభాస్కర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా ప్రజలకు అందుబాటులో ఉంచాలని, బుకింగ్ ప్రకారం మాత్రమే సిలిండర్ సరఫరా చెయ్యాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన, అధిక ధరలకు విక్రయించిన 1955 నాటి నిత్యవసర సరుకుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రతి రోజు స్టాక్ వివరములు పరిశీలించాలన్నారు. సంబంధిత గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఏజెన్సీలో 136 సిలిండర్లు నిల్వగా 50 గ్యాస్ సిలిండర్లు డిఫెక్ట్‌గా గుర్తించడం జరిగింది. ప్రస్తుతం బుకింగ్ 255గా ఉంది ఆదివారం 360 గ్యాస్ సిలిండర్ల బండి లోడు లారీ రాబోతుంది కాబట్టి మండలంలోని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. యధావిధిగా ఎల్పీజీ గ్యాస్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ ఆఫ్రిన్, వీఆర్వో మల్లీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## పాతముడివేములలో కార్డెన్ సెర్చ్



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మార్చి 14)**
మండలంలోని పాతముడివేముల గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్ మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ అస్సాన్ తెలిపారు. సరైన పత్రాలు లేనటువంటి, అనుమానాస్పదంగా ఉన్నటువంటి వాహనాలను సీజ్ చేయడం జరిగింది. సరైన పత్రాలు చూపించిన వాహనాలను మరలా వాహనదారులకు అప్పగించారు. వాహనాలు నడుపు ప్రతి ఒక్కరు సరైన పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, తప్పక తీసుకోవాలని సూచించారు. రోడ్ భద్రతకు సంబంధించిన పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం ఎస్ఐ శివరామయ్య, పెద్దారవీడు ఎస్ఐ సాంబశివయ్య, త్రిపురాంతకం,పెద్దారవీడు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈదర వారి వివాహ వేడుకల్లో బుర్రా



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 14)**
కందుకూరు పట్టణంలో శనివారం ఎస్‌వీఎస్ కల్యాణ మండపంలో కందుకూరు రూరల్ వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షులు ఈదర రమేష్ కుమారుడు జ్యోతి ప్రకాష్ దీపికల వివాహ కార్యక్రమంకి హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆయన వెంట కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

### బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ ఏలూరి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 14)**
ఈ నెల 16 వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఎక్కడ కూడా ఒత్తిడికి గురి గాకుండా, ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సంవత్సరం పొడవునా చేసిన కృషి ఫలితాన్ని చూపించే సమయం ఇదేనని, ప్రతి విద్యార్థి ప్రశాంతంగా ప్రశ్నపత్రాన్ని సమాధానపరిచి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలకు వెళ్లే ముందు తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశిస్తూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ధైర్యం చెప్పి వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 14)**
మానవ సంబంధాల కంటే ఆర్థిక సంబంధాల ముఖ్యమైన ఈ రోజుల్లో 40 సంవత్సరాల నుండి ఆస్తుల బాగ పంపిణీ విషయంలో రాజీ కుదరకుండా రెండు తరాలుగా న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్న ప్రకాశం జిల్లా పరిధిలోని కొప్పోలు గ్రామంలోని అన్నదమ్ముల, వారి వారసులు మధ్య 1986 నుండి నడుస్తున్న పార్టిషన్ కేసును వ్యాజ్యాన్ని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్ హేమలత ఇరు వర్గాల ఆమోదంతో పరిష్కరించినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్, ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి. రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రెండవ శనివారం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నందు 231 సివిల్ కేసులు 16,615 క్రిమినల్ కేసులు 14 పీఎల్‌సీ కేసులు మొత్తంగా 16860 కేసులు పరిష్కరించినట్టు, కక్షిదారులకు దాదాపుగా 5 కోట్ల రూపాయల పరిహారం వివిధ రకాల కేసుల్లో ఇప్పించడం జరిగిందని జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 27 బెంచీల్లో వ్యాజ్యాల పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించినట్టు తెలిపారు.

## జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్




**(షణ్ముఖ వెలుగు, కొండపి, మార్చి 14)**
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలంలో మండల అధ్యక్షులు గూడా శశిభూషణ్, మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం, సింగరాయకొండ మండలంలో మండల అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్, మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం, జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, పొన్నలూరు మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమంలో జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను, భావాలను ప్రతి ఒక్క జనసైనికులు, వీర మహిళలు పునికి పుచ్చుకుని, పవన్ కళ్యాణ్ అడుగుజాడలో నడుస్తూ వారి ఆలోచనా విధానానికి వారసులుగా మారి గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్క పేదవాడి కోసం పెట్టిన పార్టీ మన జనసేన పార్టీ, జనసేన పార్టీ అంటే నమ్మకం, ధైర్యం, నిజాయితీ, నిబద్ధత, ప్రశించేతత్వం, ప్రతి ఒక్క పేదవాడి గుండె చప్పుడు అని అన్నారు. నియోజకవర్గంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న ఐనాబత్తిన రాజేష్‌కి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీ జన సైనికులకు, వీర మహిళలకు పార్టీలో అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తూ ఉన్నతమైన పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులకు, వీరమహిళలకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు.


# రాజుగారిపాలెంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

### రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మార్చి 14)**
మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించి, పనులు నాణ్యతగా మరియు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తిరుపతి రాజు, అచ్చిరాజు, శ్రీనివాసరావు, నాగాంజనేయులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మార్చి 14)**
మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొర్రపాటి వెంకటేశ్వర్లు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి కొర్రపాటి వెంకటేశ్వర్లు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పని చేస్తూ గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. వారి మరణం పార్టీకి , కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.